# అనగనగా...

..ఒక పల్లెటూరిలో పధ్నాలుగేళ్ళ ఒక అనాథ అమ్మాయి పొలం పనులు చేసుకుంటూ కాలం గడుపుతూ ఉండేది. ఒక రోజు సాయంకాలం భారీగా వర్షం పడుతూ ఉంది. ఇంటినుండి పొలం రెండు మైళ్ళు. రోజూ కూనిరాగాలు తీసుకుంటూ అడుగులో అడుగు వేసుకుంటూ ఇంటికి చేరే మనిషి ఆ వర్షం తాకిడికి, ఆ ఉరుములు మెరుపులకి కంగారు కంగారుగా పరిగెత్తడం మొదలు పెట్టింది.
కనుచూపు మేరలో ఇల్లు కనిపిస్తోంది. కానీ వర్షం తీవ్రత ఇంకా ఎక్కువయేసరికి తగ్గేవరకు ఎక్కడయినా ఆగితే మంచిదని ఒక మర్రి చెట్టు కింద నిలబడింది.
కాసేపటికి వర్షం హోరు తగ్గింది. ఇక పరిగెత్తి ఇంటికి చేరదాము అనుకుంటుండగా సన్నగా ఎవరిదో చిన్న గొంతు వణుకుతూ వినిపించింది. ఎవరా అని ఆ చెట్టు చుట్టూ తిరుగుతూ చూస్తే చెట్టుకి అవతలి వైపున ఒక ఎనిమిదేళ్ళ అమ్మాయి చలికి వణుకుతూ నిల్చుని ఉంది. అయ్యో పాపం అనుకుని తన దగ్గరికి వెళ్ళి..
..'చిట్టీ నువ్వేనా..' అని పిలిచింది ఆ అమ్మాయి ఇదివరకు తనతో కొన్నేళ్ళు గడిపిన చిట్టిలా అనిపించేసరికి.
వణుకుతున్న చిట్టి నెమ్మదిగా తల పైకెత్తి చూసి 'గంగా..నువ్వా? ఇక్కడకి ఎలా వచ్చావు?' అంది.
'నేనిక్కడే ఉంటున్నాను ఏడాది నుండి. నువ్వేంటి ఇక్కడ?'
'పక్క ఊరిలో రైతు బజారు పెట్టారు కదా. మా యజమాని అక్కడ అమ్ముతున్నాడు. ఆయనతో వచ్చా. ఈ వూళ్ళో గిరీశం అని ఆయన స్నేహితుడు ఒకాయన ఉన్నాడుట. ఆయనకి ఏదో చీటీ ఇచ్చిరమ్మంటే నేనిలా వచ్చా.'
'ఓహో..బాగుంది. మొత్తానికి చాలా రోజుల తర్వాత కలుసుకున్నాం. నీకంతా బాగానే జరుగుతోందా?'
'..నాకే, శుభ్రంగా ఉంది. నా యజమాని మంచోడే. వాళ్ళింట్లోనే ఉంటున్నా నేను. అంతా అక్కడే. సుఖంగా ఉంది. నా గురించి సరే నీ గురించి చెప్పు. అప్పట్లో ఏదో డ్వాక్రాలో చేరతానన్నావు. చేరావా? రాత్రి బడికి కూడా వెళ్తాననేదానివి. వెళ్తున్నావా?'
'..నీకన్నీ బాగానే గుర్తున్నాయి. డ్వాక్రాలో చేరడానికి ప్రయత్నించా. కానీ అక్కడ నా అంతట నేను తయారు చేసిన వస్తువేదో ఒకటి చూపించమన్నారు. కూలి పనికి వెళ్ళడం మానేసి అది తయారు చెయ్యడానికి కొన్ని వారాలు ప్రయత్నించా. కానీ కుదరలేదు. దగ్గర డబ్బులేక మళ్ళీ పొలం పనులకి పోవాల్సి వచ్చింది. నెమ్మదిగా డబ్బు కూడబెట్టి మళ్ళీ ప్రయత్నిస్తా ఎప్పుడో. బడికి వెళ్ళడం అయ్యే పని కాదులే. అంత ఓపికా, తీరికా లేవు. అది సరే గానీ వర్షం తగ్గింది కదా నా ఇంటికి వెళ్దాం పద. కాసేపు కూర్చుని మాట్లాడుకుందాం. నువ్వసలే బాగా వణుకుతున్నావు.'
'సరే..పద.'
ఇద్దరూ పరిగెత్తుకుంటూ గంగ ఇంటికి చేరుకున్నారు. తన చిన్న పాకకి తలుపులా పెట్టిన తడికెని తీసి లోపలకి వెళ్ళి 'ఇక్కడే నేనుండేది. లోపలకి రా..' అంది.
చిట్టి లోపలకి అడుగు పెడుతూనే పైకి చూసింది వర్షం నీళ్ళేమైనా కారుతున్నాయేమోనని. అది గమనించిన గంగ '..పైకప్పు కారదులే. మొన్నే తాటాకులు కప్పా..' అని '..ఇదిగో తల తుడుచుకో. ఈ గౌను వేసుకో. చాలా పాతది. కానీ ఉతికినది ఇదొక్కటే ఉంది..' అంది.
చిట్టి 'అలాగే..' అని తల తుడుచుకుని, ఆ గౌను వేసుకుని కూర్చుంది.
'మంచి నీళ్ళు తాగుతావా..' అడిగింది గంగ. 'టీ పెడదామంటే పొయ్యి వెలగడంలేదు.'
'టీ వద్దులే. మంచి నీళ్ళు ఇవ్వు..' అంది చిట్టి.
మంచి నీళ్ళు తాగి ఇద్దరూ మళ్ళీ మాటల్లోకి దిగారు. తాము కలిసి గడిపిన రోజుల గురించి మాట్లాడుకున్నారు.
కాసేపయ్యాక చిట్టి బయటకి చూసి 'గంగా..నేనిక వెళ్తా. వర్షం బాగా తగ్గింది. చీకటి పడేలా కూడా ఉంది. ఆ గిరీశం గారిని కలిసి మళ్ళీ నా యజమాని దగ్గరికి పోవాలి. ఈ గౌను...' అని ప్రశ్నార్థకంగా ఆగింది.
'గౌను నీ దగ్గరే ఉంచుకో. నీది నా దగ్గర ఉందిగా. మళ్ళీ కలిసినప్పుడు మార్చుకుందాం. ఇంతకీ మళ్ళీ

కలిసేదెప్పుడు?' అని అడిగింది.

చిట్టి నవ్వుతూ 'ఏమో మరి. మళ్ళీ వర్షం పడాలి..నేను ఇటువైపు రావాలి..'

'..నేను ఆ మర్రి చెట్టు కింద నిల్చోవాలి..'

'ఆ..అలా అన్నీ కలిసొచ్చినప్పుడే మళ్ళీ కలుస్తామేమోలే. మరి నేను వెళ్ళనా..'

'వెళ్ళిరానా అనాలి..'

'సరే..వెళ్ళిరానా?'

'వెళ్ళిరా.'

చిట్టి బయలుదేరింది. గంగ తనతో బయటిదాకా వచ్చి, కాసేపు చెయ్యి ఊపి చిన్నగా నిట్టూరుస్తూ లోపలకి వెళ్ళింది. ఆ నిట్టూర్పులో భావమేమిటో గానీ ఒకటి మాత్రం నిజం. పరిచయం ఒక అవకాశం. పలకరింపులే ప్రయత్నం. ఫలితం - మమతానురాగం, మరిచిపోలేని స్నేహబంధం.

ప్రయత్నం తెచ్చే ఫలితం, ఫలితంకోసం ప్రయత్నం - మనిషికి కావల్సిన ప్రేమానురాగాలని అందించేది ఏదైనా మంచిదే. ప్రయత్నలోపం వల్లో, ఫలితం గురించిన నిరాశ వల్లో ఆ ప్రేమానురాగాలకి మనిషి దూరం అయితే ఆ దూరం కలిగించే నొప్పి వల్ల ఆ దూరాన్ని తగ్గించే ప్రయత్నం తప్పక చేస్తాడు, చెయ్యాలి కూడా!

20/12/2004